యుద్ధంలో రష్యా అమానుష నేరాలు

యూఎన్ కమిషన్ నివేదిక

జెనీవా, మార్చి 14: ఉక్రెయిన్‌తో యుద్ధం సాగిస్తున్న రష్యా బలవంతపు అదృశ్యాలు, చిత్రహింసలు వంటి అమానుష నేరాలకు పాల్పడినట్టు ఐక్య రాజ్య సమితి(యూఎన్) దర్యాప్తులో తేలింది. ఉక్రెయిన్‌లోని పౌరులపై యుద్ధ నేరాలకు రష్యా పాల్పడిందని యూఎన్‌కు చెందిన స్వతంత్ర అంతర్జాతీయ దర్యాప్తు కమిషన్ తన తాజా నివేదికలో పేర్కొంది. ఈ నివేదికను వచ్చేవారం లాంఛనంగా యూఎన్‌కు సమర్పించనున్నది. మానవాళికి వ్యతిరేకంగా బలవంతపు అదృశ్యాలు, చిత్రహింసలకు రష్యా అధికారులు పాల్పడ్డారని నివేదిక పేర్కొంది. రష్యా తన అధీనంలోకి తెచ్చుకున్న ప్రాంతాలలో ఉక్రెయిన్ పౌరులను పెద్ద సంఖ్యలో రష్యా నిర్బంధించిందని, వీరిలో కొందరిని రష్యాలోని ఆక్రమిత ఉక్రెయిన్‌లోని తాత్కాలిక కారాగారాలకు తరలించిందని నివేదిక పేర్కొంది. దీర్ఘకాలం సాగుతున్న నిర్బంధాలలో అదనంగా మరిన్ని మానవ హక్కుల ఉల్లంఘనలు, నేరాలకు రష్యా పాల్పడిందని తెలిపింది.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల స్వాహా?

- కాంగ్రెస్ నాయకుల అక్రమ దందా!
- ఒకరి చెక్కులు మరొకరి ఖాతాల్లోకి
- కరీంనగర్ జిల్లా ఇల్లంతకుంటలో బాధితుడికి రూ.60 వేలకు టోకరా
- 20-30 లక్షల వరకు పక్కదారి?
- బయటకు పొక్కకుండా జాగ్రత్తలు
- విచారణ జరపాలని డిమాండ్లు

కరీంనగర్, మార్చి 14 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): నిస్సహాయులకు అందాల్సిన ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను కొంతమంది కాంగ్రెస్ నాయకులు పక్కదారి పట్టిస్తున్నారా? ఓ ముఠాగా ఏర్పడి, అసలైన బాధితులకు అందజేయాల్సిన చెక్కులను అక్రమ మార్గంలో సొమ్ము చేసుకుంటున్నారా? ఒకరి చెక్కులను మరొకరి ఖాతాలో వేసుకొని, ఆ డబ్బులను పంచుకుంటున్నారా? అంటే అవుననే సమాధానమే వినిపిస్తున్నది. తాజాగా కరీంనగర్ జిల్లా మానకొండూర్ నియోకవర్గంలోని ఇల్లంతకుంట మండలంలో వెలుగు చూసిన వ్యవహారం అందుకు నిలువెత్తు నిదర్శనం. ఇల్లంతకుంట మండల కేంద్రానికి చెందిన కే రవి తన తండ్రిని ఓ ప్రైవేట్ దవాఖానలో గతంలో చికిత్స చేయించారు. అందుకు అయిన ఖర్చులను ఇవ్వాలని కోరుతూ.. ముఖ్యమంత్రి సహాయనిధికి ఆయన దరఖాస్తు చేసుకోగా.. నెల రోజుల క్రితం అతని పేరిట రూ.60 వేల చెక్కు వచ్చినట్టు విశ్వసనీయ సమాచారం. ఈ విషయాన్ని తెలుసుకున్న కొంతమంది ఇల్లంతకుంట మండల కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి చెక్కును తీసుకెళ్లినట్టు తెలిసింది. ఆ చెక్కును అదే మండలం రహీంఖాన్ పేటకు చెందిన కే రవి అనే పేరున్న వ్యక్తి ఖాతాలో జమచేసి, సొమ్ము చేసుకున్నట్టు విశ్వసనీయ సమాచారం. అనంతరం వారు పంచుకున్నట్టు సమాచారం. వేరే వ్యక్తి చెక్కును తన ఖాతాలో ఎందుకు వేస్తున్నారని సదరు వ్యక్తి ప్రశ్నిస్తే.. 'అంతా మేం చూసుకుంటాం. మీకెందుకు' అని చెప్పినట్టు తెలిసింది. చెక్కు వచ్చిన విషయం రెండు రోజుల క్రితం అసలు బాధితుడికి తెలియగా అక్రమార్కుల విషయం బయటపడింది.

వర్గపోరుతో బయటపడ్డ స్కామ్..

ఇల్లంతకుంట మండల కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు కారణంగానే ఈ వ్యవహారం బయటకు పొక్కింది. కొన్ని సీఎంఆర్ఎఫ్ చెక్కులు పూర్తి ఇంటిపేరు లేకుండా వస్తాయి. ఈ విషయాన్ని తమకు అనుకూలంగా మలుచుకున్న కొందరు ఈ దందాకు తెరలేపారు. ఈ వ్యవహారమంతా పకడ్బందీగా జరుగుతున్నది. ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు ఆ నాయకులు ముందుగా తెలుసుకుంటున్నారు. అదే సమయంలో సంబంధిత వ్యక్తిని పోలిన పేరున్న మరొకరిని ముందుగానే వెతుక్కుంటున్నారు. చెక్కు రాగానే దాన్ని బాధితులకు అప్పగిస్తామంటూ.. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి తీసుకెళ్తున్నట్టు తెలుస్తున్నది. ఈ వ్యవహారం నాలుగైదు నెలలుగా జరుగుతున్నట్టు అధికార పార్టీలో చర్చ నడుస్తున్నది. ఇల్లంతకుంట మండలంలో కాంగ్రెస్ పార్టీలో రెండు వర్గాలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో ఒక వర్గం నడుపుతున్న ఈ అక్రమ దందాను మరో వర్గం వారు వెలుగులోకి తెచ్చినట్టు చర్చ జరుగుతున్నది. ఈ వ్యవహారంపై పోలీసులకు సమాచారం ఇచ్చామని ఒక వర్గం చెబుతుండగా.. పోలీసులు మాత్రం తమ దృష్టికి రాలేదని అంటున్నారు. దీంతో స్థానిక పోలీసులు స్పందించకపోతే.. ఆధారాలతో సహా పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు మరో వర్గం ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తున్నది. ఈ దందా బయటకు పొక్కకుండా ఉంచేందుకు పలువురు ప్రజాప్రతినిధులు రంగంలోకి దిగారని సమాచారం.

రూ.20-30 లక్షల వరకు స్వాహా?

ఈ అక్రమ దందా గురించి లోతుగా విచారిస్తే భారీ కుంభకోణం బయట పడవచ్చన్న చర్చ కొనసాగుతున్నది. పలువురు అధికార నేతలు దీన్ని ప్రధాన వృత్తిగా మార్చుకున్నారని తెలుస్తున్నది. ఈ తరహాలో పలు మండలాల్లో దాదాపు రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు కొల్లగొట్టారన్న ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై ప్రభుత్వం, అధికార యంత్రాగం విచారణ జరిపిస్తుందా? లేదా అన్నది చూడాలి.

గ్రూప్-3 ఫలితాల విడుదల

- జీఆర్ఎల్ విడుదల చేసిన టీజీపీఎస్సీ
- టాప్-10లో 9 మంది పురుషులే

హైదరాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ) : గ్రూప్-3 జనరల్ ర్యాంకింగ్ లిస్టును(జీఆర్ఎల్) టీజీపీఎస్సీ శుక్రవారం విడుదల చేసింది. 2.5లక్షలకు పైగా అభ్యర్థుల ర్యాంకులను ప్రకటించింది. జీఆర్ఎల్‌తో పాటు గ్రూప్-3 ఫైనల్ కీ, మాస్టర్ ప్రశ్నపత్రాన్ని సైతం కమిషన్ వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. 1,388 పోస్టుల భర్తీకి నవంబర్ 17, 18న టీజీపీఎస్సీ రాత పరీక్ష నిర్వహించింది. 5,36,400 మంది అభ్యర్థులు దరఖాస్తులు సమర్పించగా, 2,67,921 మంది పరీక్షకు హాజరయ్యారు. టాప్-10 ర్యాంకుల్లో 9 ర్యాంకులు పురుషులే సొంతం చేసుకున్నారు. కేవలం 8వ ర్యాంకు మాత్రమే మహిళా అభ్యర్థి కైవసం చేసుకోవడం గమనార్హం. సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు ఎంపికైన వారి వివరాలను వెబ్‌సైట్‌లో పొందుపరుస్తామని, వ్యక్తిగతంగా సమాచారమిస్తామని టీజీపీఎస్సీ తెలిపింది. సాంకేతిక సమస్యలుంటే 040-23542185, 23542187 నంబర్లు, helpdesk@tspsc.gov.in. ఈ-మెయిల్‌ను సంప్రదించాలని సూచించింది.

కటాఫ్ ఇలా ఉండే చాన్స్

కటాఫ్‌పై పలు రకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. బీసీ క్యాటగిరీలో 270-230 మార్కులు, ఎస్సీ 235-230, ఎస్టీ-230, దివ్యాంగులు-200, ఈడబ్ల్యూఎస్ క్యాటగిరీలో 230 మార్కుల వరకు కటాఫ్ ఉండొచ్చని పోటీపరీక్షల శిక్షకులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే జేఎల్, గ్రూప్-2, గ్రూప్-1 ఫలితాలొచ్చాయి. 17న హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ (హెచ్‌డబ్ల్యూవో) పోస్టుల ఫలితాలు విడుదలకానున్నాయి. హెచ్‌డబ్ల్యూవోలో ప్రతిభసాధించిన వారు గ్రూప్-3 పోస్టులను ఎంపికచేసుకునే అవకాశాల్లేవు. దీని ప్రభావం కటాఫ్‌పై పడనున్నది. ఈ నేపథ్యంలో టాప్-10 మార్కులు 320 వరకు ఉన్నా కటాప్ అంతకంటే తగ్గే అవకాశముంటుందని పోటీపరీక్షల శిక్షకులు అంచనా వేస్తున్నారు.

చిన్న తప్పు.. పెద్దశిక్ష

- గ్రూప్స్ పరీక్షల్లో భారీగా ఇన్‌వాలిడేషన్
- గ్రూప్-2, 3లో 31వేల మంది అనర్హులు

హైదరాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ): హాల్‌టికెట్ నంబర్ లేదా ప్రశ్నపత్రం నంబర్ తప్పుగా రాయడం, గడులను సక్రమంగా నింపకపోవడం, ఒకసారి నింపిన గడులను తప్పు అని తెలుసుకొని చెరిపివేయడం వంటి చిన్న చిన్న పొరపాట్లు పోటీపరీక్షల అభ్యర్థుల పాలిట శాపంగా మారుతున్నాయి. చిన్న పొరపాటే పెద్దశిక్షకు దారితీస్తున్నాయి. ఇలాంటి తప్పిదాల కారణంగా గ్రూప్స్ పరీక్షల్లో వేలాది మంది అభ్యర్థులపై అనర్హత వేటుపడింది. కొందరు టాప్ మార్కులకు దగ్గరగా ఉన్న వారు సైతం ఫలితాలు చూసుకుని అవాక్కయ్యారు. జీఆర్ఎల్‌లో తమ హాల్‌టికెట్ నంబర్ లేకపోవడం, ఓఎమ్మార్‌లో చూస్తే తప్పులుండటంతో అయ్యో రామా..! అంటూ నిట్టూర్చాల్సిన పరిస్థితి తలెత్తుతున్నది. గ్రూప్-2, గ్రూప్-3 రెండు పేపర్లలో 31,679 మంది అభ్యర్థులపై అనర్హత వేటు పడింది. అత్యధికంగా గ్రూప్-3లో 18 వేల మంది, గ్రూప్-2లో 13 వేల మంది ఓఎమ్మార్ షీట్లు ఇన్‌వాలిడ్ అయ్యాయి. గ్రూప్-1లో కొంత మంది పేపర్లు ఇన్‌వాలిడ్ అయ్యాయి. దీంతో ఆయా అభ్యర్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. టీజీపీఎస్సీ అధికారులు మానవ తాదృక్పథంతో తమ ఓఎమ్మార్ షీట్లను లెక్కలోకి తీసుకుని, తమకు అవకాశం కల్పించాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు.

కొన్ని ఉదాహరణలు..

- ఓ అభ్యర్థికి మూడు పేపర్లలో 270 మార్కులొచ్చాయి. ఈ అభ్యర్థి గడులు సరిగ్గా నింపని కారణంగా అనర్హత వేటువేశారు.
- ఓ మహిళా అభ్యర్థి ప్రశ్నపత్రం బుక్‌లెట్ నంబర్‌ను తప్పుగా బబుల్ చేసింది. మొదటి నంబర్ ఒకటి అని రాసి గడులు నింపే క్రమంలో ఒకటి అంకెకు బదులు సున్నా అంకెను బబుల్ చేసింది. దీంతో సదరు అభ్యర్థిపై అనర్హత వేటుపడింది.
- ఓ అభ్యర్థికి గ్రూప్-3లో 288 మార్కులొచ్చాయి. సరిగా గడులు నింపని కారణంగా ఈ అభ్యర్థిపై అనర్హత వేటు పడింది.
- గ్రూప్-3 ఫలితాల్లో మహిళా క్యాటగిరీలో టాప్ ర్యాంకు 325 కాగా, టాప్ టెన్‌లో ఉన్న చివరి అభ్యర్థినికి 301 మార్కులొచ్చాయి. ఫలితాల్లో చూస్తే ఓ అభ్యర్థినికి 288 మార్కులొచ్చినా ఇన్‌వాలిడ్‌కావడంతో ఇప్పుడా అభ్యర్థిని ఆవేదన వర్ణనాతీతంగా మారింది.

- రాజ్‌భవన్‌లో ఘనంగా హోలీ

హైదరాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ) : రాజ్‌భవన్‌లో శుక్రవారం హోలీని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చిన్నారులతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. ఆయన రాష్ట్ర ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

ఉక్రెయిన్ సైనికులపై కనికరం చూపండి

పుతిన్‌కు ట్రంప్ విజ్ఞప్తి

వాషింగ్టన్, మార్చి 14: రష్యా-ఉక్రెయిన్ యుద్ధంపై రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో నిర్మాణాత్మక చర్చలు సాగించినట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. గురువారం తమ ఇద్దరి మధ్య జరిగిన ఫోన్ సంభాషణ వివరాలను ఆయన తెలిపారు. యుద్ధం సందర్భంగా పూర్తిగా లొంగిపోయిన ఉక్రెయిన్ సైనికుల ప్రాణాలను కాపాడాలని తాను పుతిన్‌ను కోరానన్నారు. గత మూడేండ్లుగా సాగుతున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధ సంక్షోభం త్వరలోనే ముగియడానికి అవకాశం ఉందన్నారు. ఈ యుద్ధ రక్తపాతానికి తెర పడుతుందన్న ఆశాభావాన్ని సైతం తాను వ్యక్తం చేసినట్టు ట్రూత్ సోషల్ మీడియాలో ట్రంప్ వెల్లడించారు.

వంద మందితో వెళ్తున్న ఆర్టీసీ బస్సు బోల్తా

20 మందికిపైగా గాయాలు

వికారాబాద్ జిల్లా పరిగిలో ఘటన

పరిగి, మార్చి 14: వికారాబాద్ జిల్లాలో ఆర్టీసీ బస్సు అదుపు తప్పి బోల్తా పడటంతో 20 మందికిపైగా ప్రయాణికులకు గాయాలయ్యాయి. పరిగి డిపోకు చెందిన అద్దె బస్సు శుక్రవారం రాత్రి 7.30 గంటల సమయంలో పరిగి నుంచి షాద్‌నగర్ బయలుదేరింది. పరిగి శివారు దాటిన తర్వాత బస్సు డ్రైవర్ టికెట్ల కోసం రోడ్డు పక్కన నిలిపే ప్రయత్నం చేస్తుండగా.. మట్టిలోకి టైర్లు దిగబడటంతో అదుపు తప్పి బస్సు బోల్తా పడింది. ఈ బస్సులో 90 మందికిపైగా ప్రయాణికులు ఉన్నట్టు సమాచారం. వారిలో సుమారు 20 మందికిపైగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న పరిగి ఎస్సై సంతోష్‌కుమార్ సిబ్బందితో వచ్చి క్షతగాత్రులను అంబులెన్స్‌లో పరిగి దవాఖానకు తరలించారు.

బోల్తాపడిన ఆర్టీసీ బస్సు

గూగుల్ మ్యాప్‌తో వెళ్లి.. ప్రమాదంబారిన పడి

- *నిద్రమత్తులో కాలువలోకి దూసుకెళ్లిన కారు*

భిక్కనూరు, మార్చి 14: గూగుల్ మ్యాప్ ఆధారంగా కారులో ప్రయాణించిన ఓ కుటుంబం ప్రమాదం బారినపడింది. నిద్రమత్తులో డ్రైవింగ్ చేయడంతో కారు అదుపుతప్పి కాలువలోకి దూసుకెళ్లింది. ఈ ఘటన కామారెడ్డి జిల్లా భిక్కనూరులో చోటుచేసుకున్నది. హైదరాబాద్‌లోని ఈసీఐఎల్‌కు చెందిన ఓ కుటుంబం శుక్రవారం వేకువజామున ఆదిలాబాద్ జిల్లా బాసర సరస్వతి ఆలయానికి కారులో బయల్దేరింది. వారు గూగుల్ మ్యాప్ ఆధారంగా వెళ్తుండగా మార్గమధ్యంలో భిక్కనూరు మండలం 44వ జాతీయ రహదారి మీదుగా కాకుండా తహసీల్ ఆఫీస్ నుంచి లొకేషన్ చూపించింది. దీంతో వారు ఆ మార్గం గుండా వెళ్లారు. కారు నడుపుతున్న వ్యక్తి నిద్రమత్తులో ఉండటంతో కారు రోడ్డు పక్కనున్న కాలువలోకి దూసుకెళ్లగా.. బురదలో చిక్కుకొని అక్కడే ఆగిపోయింది. కారులో ఉన్న వారు 100 నంబర్‌కు డయల్ చేసి సమాచారం అందించారు. వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వచ్చి కాలువలోకి దూసుకెళ్లిన కారును జేసీబీ సాయంతో బయటికి తీయించారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.